
"ఏమ్మా శిరీషా! మీ అత్తయ్యను లేచి భోజనం చెయ్యమనక పొయ్యావా"? అన్నారు, చూస్తున్న పేపరు పక్కన పడేసి, తనకు రెండోసారి కాఫీ తీసుకొచ్చిన కోడలితో పుండరీ కాక్షయ్య.

ఇప్పటి కైదారుసార్లు పిల్చాను మామయ్యా! అత్తయ్య లేచి రావడంలేదు. పదే పదే పిలుస్తుంటే నామీద కోప్పడుతున్నారు. ఎన్నాళ్ళిలా భోజనం లేకుండా వుంటారో అర్థం గాకుండా వుంది!" అంది శిరీష.

"గొప్ప చావొచ్చి పడిందమ్మా!.... రామం చూస్తే కట్నం తక్కువైనా ఆ రామనాథం గారమ్మాయినే చేసుకుంటానంటాడు.... ఈవిడకు చూస్తే డబ్బు పిచ్చి!.... మొన్నా వెంకటాపురం వాళ్ళొచ్చి వెళ్ళినప్పట్నుంచీ ఈవిడ పిచ్చి మరీ ముదిరిపోయింది. అన్నం తినడం మాని అర్థాంతరం




చావు చావాలనుకుందో ఏమో!.... రామానికి నువ్వు కూడా ఒకసారి చెప్పలేక పోయావటమ్మా!?" అన్నారు బాధగా పుండరీ కాక్షయ్య.

"మన ఇంట్లో ఈ సమస్య తలెత్తిన రోజునే నేను, ఆయనా కూడా రామానికి చిలక్కి చెప్పినట్టు చెప్పాం మామయ్యా!.... అయినా రామం తనపట్టు విడవడంలేదు.... వ్యక్తిత్వం వచ్చిన ప్రతి మనిషికీ కొన్ని ఇష్టాయిష్టాలు వుంటాయి కద మామయ్యా!....'

"అందుకేనమ్మా నేను వాడికి గట్టిగా చెప్పలేక పోతున్నాను.... డబ్బు పిచ్చిలోపడి పార్వతి ఆ విషయం గుర్తించలేకపోతోంది! పూటకింత అన్నంలేక ఎంతో మంది అల్లాడి పోతుంటే అన్నీ వుండి తినడాని కభ్యంతరం దీవిడ....." అని ఒక్క క్షణం ఆగి "లోపల రాజ్యలక్ష్మి ఏం చేస్తుందమ్మా?" అడిగారు పుండరీ కాక్షయ్య.

"ఏదో పత్రిక చదువుకుంటోంది మామయ్యా!"

"పుస్తకాలు తప్ప వేరే ధ్యాసుండదు దానికి.... నువ్వు శ్రమనుకోక దాన్ని కూడా పిల్చి; అన్నీ వడ్డించి పట్టుకెళ్ళి ఆవిడ్ని అన్నం తినమని చెప్పండమ్మా!" అన్నారు ఆ వేదనగా పుండరీకాక్షయ్య.

"అలాగే మామయ్యా!" అని లోపలి కెళ్ళింది శిరీష.

శిరీష అలా వెళ్ళగానే కాఫీ త్రాగి – పార్వతమ్మగారి మొండి పట్టుదలేమిటో అంతు బట్టని పుండరీ కాక్షయ్య ఆలోచనలో పడ్డారు....

తాలూకా ఆఫీసులో హెడ్‌క్లర్కుగా ఉద్యోగంచేసి ఈ మధ్యనే రిటైరయ్యారు పుండరీకాక్షయ్య. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒకే ఒక్క కూతురు. తను ఉద్యోగంలో వున్నప్పుడే పెద్ద కొడుకు బుచ్చిబాబును ఇంజనీరునుచేసి – రంగపట్నం సాంబశివం గారమ్మాయితో పెళ్ళిచేశారు. వారు డబ్బున్నవాళ్ళు కావడంతో అల్లుడికి నలభైవేలు కట్నం ఇవ్వడమేగాక శిరీషకు రెండువందల తులాల వెండి సామగ్రి, పదికాసుల బంగారం కూడా పెట్టారు.

ఆయన రిటైరయ్యేసరికి రెండో కొడుకు రామానికి చదువు పూర్తయి – పి. డబ్ల్యు.డి. లో సూపరువైజరుగా ఉద్యోగం రావడం.... కూతురు రాజ్యలక్ష్మి పెళ్ళి కెదగడం జరిగాయి. ఆయనరిటైరైనా జాగ్రత్త మనిషి కావడంవల్ల ఇప్పుడెలాంటి ఇబ్బందీ లేదు. అంతకు ముందే తండ్రి కట్టిన పెంకుటింటిని నాలుగు వాటాల డాబా ఇల్లుగా మార్చారు. తమ కుటుంబం మూడు వాటాల్లో వున్నా – ఒక వాటా అద్దె కిచ్చుకుంటే ఆ అద్దె డబ్బూ, తనకొచ్చే పెన్షన్ డబ్బుతో ఆయన జీవితం సాఫీగా గడిచిపోతుంది. ఎటొచ్చి రాజ్యలక్ష్మికి, రామానికి పెళ్ళిళ్ళు చెయ్యడ మొక్కటే ఆయనకు మిగిలి వున్న బాధ్యత, కుదిరితే రెండు పెళ్ళిళ్ళూ ఒకేసారిచేసి తనమీదున్న బరువు దించుకోవాలనుకుంటున్నారు.

ఆ వుద్దేశ్యంతోనే రిటైరైన వెంటనే సంబంధాలకోసం అన్వేషణ మొదలు పెట్టారు పుండరీ కాక్షయ్య. ఆయన ఆ ప్రయత్నంలోకి దిగిన కొద్ది రోజులకే కూతురు రాజ్యలక్ష్మికి – రంగపట్నంలో శిరీష బంధువులైన సర్వారాయుడు గారబ్బాయితో పదిహేను వేలు కట్నానికి సంబంధం కుదిరింది. అబ్బాయి సివిల్ డ్రాఫ్ట్‌మేన్. రానున్న శ్రావణమాసంలో పెళ్ళి చెయ్యడానికి వుభయులూ నిశ్చయించుకున్నారు.

ఈలోగా రామానిక్కూడా శంఖవరంలో ఎదో సంబంధం వుందంటే వెళ్ళి చూసొచ్చారు. వాళ్ళంతగా వున్నవాళ్ళుకాదు.... పదివేలకు మించి కట్నం ఇవ్వలేమన్నారు. అయితే అమ్మాయి మటుకు అపరంజి బొమ్మలా వుంది. అమ్మాయిని చూడగానే కట్నమెంతయినా ఆ సంబంధం చేసుకోడానికి సిద్ధపడ్డాడు రామం!.... పార్వతమ్మగారికి అమ్మాయి తెచ్చుకునే కట్నం ఎంతమాత్రం నచ్చలేదు. పుండరీకాక్షయ్యగారు మాత్రం కొడుకు అభిప్రాయంతో ఏకీభవించి – భార్య కళ్ళతో వద్దని వారిస్తున్నా పట్టించుకోకుండా – మంచిది చూసి తాంబూలాలు పుచ్చుకుందామని అమ్మాయి తండ్రి రామనాథానికి చెప్పి వచ్చేశారు.

వచ్చిన వెంటనే మొదలైంది ఇంట్లో తుఫాను!.... 'నేను వద్దంటూంటే మాటిచ్చేశారు. మీరు.... అంటే మీ కెవరికీ నామాట లెఖ్ఖలేదన్నమాట?.... బుచ్చిబాబు నలభైవేలు కట్నం తెచ్చుకున్నాడని నలుగురికీ గర్వంగా చెప్పుకున్నాం!.... వీడికేం తక్కువని పదివేల కట్నానికి ఒప్పుకుంటున్నారు? ఆ పిల్లకు మించిన అందగత్తెలే ప్రపంచంలో లేరా? ఎవరితోనైనా చెప్పుకోడానికే సిగ్గుగా వుంది!'.... అంటూ ఒకటే సాధింపు మొదలుపెట్టారు పార్వతమ్మ.

రామం తనకు నచ్చిన పిల్లను చేసుకుంటానంటున్నప్పుడు డబ్బుతో పనేముంది? ఇందులో బాధపడాల్సింది.... సిగ్గుపడాల్సిందేముంది?' అని కుటుంబ సభ్యులందరూ చెప్పినా ఆమె తలకెక్కలేదు.

పరిస్థితిలా వుండగానే నాలుగురోజుల క్రితం తణుకునుంచి రామానికి ముప్పైవేలు కట్నమిస్తామంటూ వచ్చిందో సంబంధం!.... వాళ్లామాటని పోయింది మొదలు పార్వతమ్మగారికి వున్న మతి కాస్తా పోయింది. 'వెళ్ళిచూసి ఆ సంబంధం ఖాయపర్చుకుందామని భర్తనూ – ఇప్పుడు కావాల్సింది డబ్బుగాని అందం కాదురా అయోమయం సన్నాసీ!' అని కొడుకునూ అదే పనిగా వేధించడం మొదలు పెట్టిందామె – ఎవరూ తనమాట ఖాతరు చెయ్యకపోవడంతో – తన పట్టుదల నెగ్గేవరకూ అన్నం ముట్టనని శపథంచేసి – ఆ మర్నాటినుండి అది ఆచరణలో పెట్టి: భర్తతోను, చిన్న కొడుకుతోను మాట్లాడ్డం

మానేసిందామె.

బుచ్చిబాబు, శిరిష, రాజ్యలక్ష్మి ఎంత నచ్చజెప్పినా; బ్రతిమలాడినా తన పట్టుదల విడిచి పెట్టలేదు పార్వతమ్మగారు. ఇది పని కాదని తన మీదున్న గౌరవాభిమానాల కొద్దీ రామాని కెన్నో విధాల చెప్పి చూసింది శిరిష. అతనూ – తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళనడంతో సమస్య మరింత జటిలమై పోయింది. ఒకటి, రెండు రోజుల్లో తగ్గి పోతుందనుకున్న తుఫాను – పెనుతుఫానుగా మారి ఎవరికీ మనశ్శాంతి లేకుండా చేసింది.

పార్వతమ్మగారు మూడు రోజుల్నుంచి అన్నం ముట్టక పోవడంతో పుండరీకాక్షయ్యగారు రామాన్ని పిల్చి; 'పోనీ అమ్మ చెప్పినట్టు చెయ్యకూడదట్రా! ఎవరికీ మనశ్శాంతి లేకుండా ఏమిటిదంతా?' అని మందలింపుగా అంటే– 'కట్నం ఇవ్వగలిగిన వాళ్ళదగ్గర పుచ్చుకోవచ్చును. ఇవ్వలేని వాళ్లను పీడించటమేమిటి? నాకా అమ్మాయి నచ్చింది.... వాళ్ళయినా పూరికినే చేసుకోమనకుండా వున్నంతలో కట్నం ఇస్తామంటున్నారు కదా! అటువంటప్పుడు అమ్మకెందుకింత పట్టుదల?' అని తన నిశ్చయానికి తిరుగులేదన్నట్టు ఖచ్చితంగా చెప్పేశాడు.

ఇంట్లో పరిస్థితి ఇలావుంటే–శంఖవరం రామనాథంగారికి మాటిచ్చి వచ్చినందుకు బాధపడిపోతున్నారు పుండరీకాక్షయ్య. జీవితంలో ఇంతవరకూ ఏవరికీ మాటిచ్చి తప్పలేదాయన. మంచిరోజు చూసుకొని ఆ అమ్మాయికి పసుపుకుంకుమలిచ్చి– రెండు పెళ్ళిళ్ళూ ఒకేసారి జరిపించొచ్చుని అనుకుంటూ వుంటే తన భార్య ఎందుకింత మూర్ఖంగా ప్రవర్తిస్తూందో పుండరీకాక్షయ్యగారి కర్థం కావడంలేదు.

ఆయనలా ఆలోచిస్తూండగానే– "రాజ్యలక్ష్మి.

# వదినా! వదినా! వైఢూర్యమా!!

లక్ష్మి శ్రీనివాసన్



నేను ఎంత చెప్పినా అత్తయ్య భోజనం చెయ్యడంలేదు మామయ్యా!" అంది శిరీషవచ్చి.

పుండరీకాక్షయ్యగారు బరువుగా నిట్టూర్చి- పార్వతమ్మగారి దగ్గరకెళ్లారు. మూడు రోజుల్నుంచి తిండితిప్పలు లేకుండా మొండి పట్టుదలతో వున్న భార్యను చూస్తుంటే ఆయనకు కోపం, బాధ సమపాళ్లలో పుట్టుకొచ్చాయి- "పార్వతీ, ఇదేం బావుండలేదు! ఈ విషయం ఎవరికైనా తెలిస్తే నవ్వుకుంటారు... లేచి భోజనం చెయ్యి! నన్ను బాధపెట్టకు!!" అన్నారు.

పార్వతమ్మ మాట్లాడకుండా భర్తవైపు క్రోధంగా చూశారు.

"మన సమస్య నెమ్మదిమీద పరిష్కరించు కుందామని ఎన్నిసార్లు చెప్పినా నీకు అర్థం గాకుండా వుంధి... లక్ష్యం లేకుండా వుంది. ఇలా అన్నం తినడంమాని నన్నెందుకు హింసిస్తావు? నామీద ఏపాటి గౌరవంవున్నా లేచి భోజనంచెయ్యి!" అన్నారు అనునయంగా పుండరీకాక్షయ్య.

"అదే నేనూ అడుగుతున్నాను. నామాటమీదా... నా మీదా మీకేమాత్రమైనా ప్రేమ వుందా? ఇంతకాలంగా మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న నాకు మీరిచ్చే గౌరవం ఇదేనా?? లేదండి, నామీద మీకు ప్రేమ, గౌరవం ఎంతమాత్రంలేదు... వుంటే నేను చెప్పినట్టూ వినివుండేవారు..."

# వదినా! వదినా! వైఢూర్యమా!!

"ఎందుకలా నిన్ను నీవు కించపర్చుకుంటావు పార్వతీ!.... ఆ అమ్మాయి వాడికెంతగానో నచ్చిందనీ, వాళ్లిద్దరికీ ఈడూ జోడూ బాగుంటుందనీ- అందుకే కట్నం తక్కువైనా వాళ్లకు మాటిచ్చానని ఇప్పటికెన్నోసార్లు చెప్పాను... మళ్లీ చెబుతున్నాను- అంతేతప్ప నీ మాట కాదనాలని కాదు. రామం ఇంకా చిన్నవాడుకాదు గనుక వాడి ఇష్టాన్నిబట్టి ప్రవర్తించడం మనవిధి!"

"మీరు లక్షసార్లు చెప్పండి... నాకా సంబంధం ఇష్టంలేదు. అల్లుడంటూ వెళ్తే పట్టుమని పది రోజులు ఆదరించలేని ఆ సంబంధం మనకొద్దు. వాడికేం తక్కువని ముష్టి పదివేలకా సంబంధం చేద్దామనుకుంటున్నారు?... వెనకా ముందూ లేనివాళ్లకు- ఏ ఉద్యోగం లేనివాళ్లకు వేలకు వేలు కట్నంతో పెళ్లిళ్లు జరుగుతుంటే- వాడేదో అన్నాడని మీరా మాటకు వంతపలకడానికి, విలువనివ్వడానికి నేనొప్పుకోను. కాదని ఆ సంబంధమే చేస్తారా నేను చావడం ఖాయం!"...

ఆమె మాటల్లో తీవ్రమైన పట్టుదల;డబ్బుపై వ్యామోహం; నా కొడుకింత కట్నం తెచ్చుకున్నాడని నలుగురికీ గొప్ప చెప్పుకోవాలన్న తహతహ సుస్పష్టంగా వ్యక్తమవుతున్నట్టు గ్రహించారు పుండరీకాక్షయ్య కట్నాలింతిలా విజృంభించడానికి ముఖ్యంగా తన భార్యలాంటి వాళ్లే కారణమని ఆయన కనిపించింది. తన తల్లి తండ్రులు కేవలం అయిదువందలు ఇచ్చి- తనతో పెళ్లి జరిపించిన విషయం ఆమె విస్మరించడం ఆయనకెంతో బాధ కలిగించింది.

"సరే, నన్నిప్పుడేం చెయ్యమంటావు పార్వతీ! ఏం చేస్తే నువ్వు భోజనం చెయ్యదల్చుకున్నావు?" కొన్ని క్షణాల తర్వాత అడిగారాయన.

"మారామం ఇంతలో పెళ్లి చేసుకునే ఉద్దేశంలో లేడని ఆ రామనాధంగారికి ఉత్తరం వ్రాసెయ్యండి... మొన్నొచ్చిన సంబంధం మనం ఖాయం చేసుకుందాం!"

"అంటే నా మాట విలువపోయినా నీ పట్టుదల నెరవేరాలన్నమాట... నీకు డబ్బు కావాలన్నమాట... సరే, కాస్సేపట్లో రామం భోజనానికొస్తాడుగా- వాడితో ఒక్క మాట చెప్పి నీ కోరిక ప్రకారం చేద్దాం... నువ్వు భోజనం చెయ్యి!" అన్నారు మనసులోనే మధనపడుతూ పుండరీకాక్షయ్య.

"వాడికి చెప్పడమేమిటి... అసలు వాడిష్టమేమిటీ? అని? వాడి మంచి, చెడ్డలు మనకు తెలియవనా?... మాట మాట్లాడితే అందం.... అందం అంటాడు. వెధవ!... అందం కొరుక్కు




నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మ వ్యాధులనుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, సంతానము లేక పోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టు ద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు": ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6–30 గం. వరకు. ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అశోకాలో కోటగుమ్మం దగ్గర మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

**డా॥ డి. మార్కండేయులు**

**ఆయుర్వేద భిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్,**

**పార్కురోడ్, గుడివాడ. 521301**

**ఫోన్స్ : 522 & 540**




Delite

Plastic Torches


**Kamal Enterprises**

Room No. 10, 5th Floor, Mohatha Market
Palton Road, Bombay-400 001.
Off. Tel.: 264851-267896, 345164.
Available at all leading stores




Blazo/KE/19/85




తింటాడో ఏమిటో? వాడొచ్చిందాకా ఆగాల్సిన పనిలేదు. ఇప్పుడే ఉత్తరం వ్రాసెయ్యండి మీరు!" అంత నీరసంలోనూ ఆవేశంతో ఎగిరి పడ్డారు పార్వతమ్మ.

ఏదో చెప్పాలనుకున్న రాజ్యలక్ష్మి, శిరిష ఆమె ఆవేశం చూసి- తమ మీద విరుచుకుపడుతుందని మౌనంగా వుండిపోయారు

"అమ్మా శిరిషా! నా డ్రాయరులో కవరుంటుందిలా తీసుకురా!" తను ఓడిపోయినట్టు తలదించుకొని అన్నారు పుండరీకాక్షయ్య.

శిరిష కవరు, పెన్నూ తీసుకొచ్చి పుండరీకాక్షయ్యగారి కిచ్చింది.

ఆయన ఉత్తరం వ్రాయడాని కుపక్రమిస్తుంటే- బయట నుంచి పోస్ట్‌మేన్ పిలుపు వినిపించింది. రాజ్యలక్ష్మి వెళ్ళి పోస్ట్‌మేన్ ఇచ్చిన కవరందుకొనివచ్చి-

"ఈ ఉత్తరం మీకేనాన్నా!" అంది పై అడ్రసు చూస్తూనే.

'ఎక్కడ్నుంచా!' అనుకుంటూ కవరు చించారాయన. అది రాజ్యలక్ష్మికి కాబోయే మామ- సర్వారాయుడుగారు రంగపట్నం నుంచి వ్రాశారు

"పుండరీకాక్షయ్యగార్కి నమస్కృతులు...

కొన్ని కారణాలవల్ల మావాడు మీ సంబంధంపట్ల అయిష్టత చూపుతున్నాడు. అదిగాక ఇంకా నాలుగైదు సంవత్సరాల వరకూ వాడు పెళ్ళి చేసుకోడట.. సంబంధం కుదిరాక ఇలా చెయ్యకూడదని ఎంత చెప్పినా వాడు వినిపించుకోవడంలేదు. ఇప్పటికే నచ్చజెప్పి విసిగిపోయాం గనక మీరిక రావడం అనవసరం జరిగినదానికి మిక్కిలి చింతిస్తున్నాం .

ఇట్లు-సర్వారాయుడు"

-ఉత్తరం చదవడం పూర్తి చేసిన పుండరీకాక్షయ్యగారికి మతిపోయినంత పనైంది. ఆయన విషయమేమిటో చెప్పకుండా మౌనంగా వుండిపోవడంతో- "ఎక్కడ్నుంచా ఉత్తరం?" అన్నారు వుండబట్టలేని పార్వతమ్మ.

"నువ్వే చదువు!" అని ఆ ఉత్తరాన్నామెకందించారు పుండరీకాక్షయ్య.

"ఏమండీ, ఏమిటిది? శ్రావణంలో పెళ్ళి చేయడానికి సిద్ధంగా మనముంటే ఈ ఉత్తరం ఏమిటి?" ఉత్తరం చదువుతూనే దిగ్భ్రాంతితో లేచికూర్చొని, అడిగారు పార్వతమ్మ. ఆమెకు దుఃఖం ఎగదన్నుకొస్తోంది.

పుండరీకాక్షయ్య మాట్లాడలేదు. ఆయనకేం పాలుపోవడంలేదు... అంతా అగమ్య గోచరమైపోయింది.

"శిరిషా ఏమిటమ్మా ఇది? ఈ సర్వారాయుడుగారు మీ బంధువని- వీళ్ళ సంబంధం చేసుకోడానికి సిద్ధపడితే అన్నీ అయ్యాక ఈ రాతలేమిటి?" అన్నారు పార్వతమ్మ.

శిరిష అత్తగారి చేతిలోని ఉత్తరం తీసుకొని చదివేటంతలో- బుచ్చిబాబు, ఆ వెనకే రామం వచ్చారు- "శిరిషా, నేను కేంపు కెళ్ళాలి తొందరగా భోజనం వడ్డించు!" లోపలికొస్తూనే అని- అక్కడంతా విచారవదనాలతో వుండటం గమనించి, "ఏమైంది?" అన్నాడు అనుమానంగా బుచ్చిబాబు. పరిస్థితేమిటో తెలియని రామం కూడా అందరి మొహాల్లోకి గుచ్చి గుచ్చి చూడసాగాడు.

సమాధానంగా వాళ్ళకు ఉత్తరం అందించింది. శిరిష. అది చదవగానే కోపోద్రిక్తుడైన బుచ్చిబాబు, "ఆడపిల్ల జీవితంతో ఆటలాడాలనుకుంటున్నారా? .. వీళ్ళకు తగిన శాస్తి చెయ్యాలి!" అన్నాడు.

"అదేదో శిరిషా, నువ్వూ వెళ్ళి తెలుసుకురండి. ఎంత పరువుతక్కువ?.. ఏ ఉరేసుకునే చావాలితప్ప మళ్ళీ వీధిలో తలెత్తుకోగలమా?" అన్నారు బాధగా పార్వతమ్మ.

"ఎందుకు తలెత్తుకోలేం పార్వతీ! మనం విసిరిన రాయి తిరిగొచ్చి మనకే తగిలినట్టు- ఇప్పుడు మనం చెయ్యాలనుకుంటున్నామో అది వాళ్ళు చేసి చూపించారు. ఇందులో తప్పేముంది? ఇక రాజ్యలక్ష్మికింతలో పెళ్ళి జరగడం కల్ల' ని కోరిక ప్రకారం ఆ శంకవరం వాళ్ళకు ఉత్తరం వ్రాసేస్తున్నాను. ఇక ఏం చెయ్యదల్చుకున్నావో- వీళ్ళకు పెళ్ళిళ్ళు ఎలా చెయ్యదల్చుకున్నావో అంతా నీ ఇష్టం!"... అంటూ ఉత్తరం రాయడాని కుద్యుక్తులయ్యారు పుండరీకాక్షయ్య.

"ఒద్దండి.. మీరా ఉత్తరం రాయొద్దు నేనొక ఆడపిల్లకు అపకారం తలపెట్టినందుకే దేవుడు నన్నిలా శిక్షించ దల్చుకున్నాడేమో!?... మీరా ప్రయత్నం మాని- మీ ఇష్ట ప్రకారం- రామం అభీష్టం ప్రకారమే చెయ్యండి... ముందు సర్వారాయుడుగారి సంగతేమిటో తేల్చండి! రాజ్యానికి అన్యాయం జరక్కుండా చూడండి!" అన్నారు, కనులవెంట నీళ్ళు జలజల రాలుతూంటే పార్వతమ్మ

అసలు జరిగినదేమిటో అప్పటికి అర్థమైంది బుచ్చిబాబుకు, రామానికి.

"ఎలా నాన్నా! నేను కేంపు కెళ్ళడం తప్పనిసరి.. మీరు, శిరిష వెళ్ళి ఇదేమిటో తెలుసుకోండి. పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తే మర్యాద దక్కదని చెప్పండి!" అన్నాడు ఆవేశంగా బుచ్చిబాబు.

"నా కలాంటివాళ్ళతో మాట్లాడ్డమే అసహ్యం! శిరిషకు వాళ్ళు బాగా తెలుసు గనక ముందు శిరిషను, రామాన్ని పంపి; మీ మామగారిచేత; శిరిషచేత మర్యాదగా అడిగిద్దాం... వాళ్ళేమైనా అడ్డదిడ్డంగా మాట్లాడితే అప్పుడు నలుగురి పెద్దల్నీ తీసుకొని మనం వెళదాం!" అన్నారు పుండరీకాక్షయ్య.

"ఔనమ్మా శిరిషా! ఇప్పుడు రాజ్యలక్ష్మి బ్రతుకు నీ చేతుల్లో వుంది. రామాన్ని తీసుకొని నువ్విప్పుడే బయల్దేరు. వాళ్ళ కెలా గుణపాఠం చెప్పాలో చెప్పి ఈ ఘోరం జరక్కుండా ఆపు!.... మన పరువు మంట గలవకుండా చూడు!"

# మెగ్నిషియమ్ లోపం వల్ల విష సంబంధమైన రోగ లక్షణాలు!

అమెరికాలో 1970 వ సంవత్సర తుది రోజులలో భయాందోళనలు కలిగించే విష సంబంధమైన రోగ లక్షణాలు (టాక్సిక్ షాక్ సింద్రోమ్) కనిపించాయి. 1980 లో ఈ జబ్బు తీవ్ర రూపం దాల్చింది. 890 మందికి ఈ రోగం సోకినట్లు తెలుస్తున్నది. వీరిలో ఎక్కువ మంది ఋతుస్రావం అయ్యే స్త్రీలైనప్పటికీ బాలలు, పురుషులు కూడా ఉన్నారు. ఈ జబ్బు కొన్ని గంటల్లోనే విజృంభిస్తుంది. మొదట జ్వరం, తల తిరగటం లక్షణాలతో ప్రారంభమై విరాకు, వంటిపై దద్దుర్లతో రక్తపుపోటు బాగా పడిపోయి ఆఖరికి రోగిని స్పృహ కోల్పోయే స్థితికి తెస్తుంది. ఈ రోగుల్లో 4 శాతం మందికి మరణం సంభవించినట్లు ఋజువైంది. ఋతుస్రావ సమయంలో స్త్రీలు వాడేటటువంటి వస్త్ర సంబంధమైన సాధనాలే (టేంపన్స్) ఈ రోగానికి కారణం అని శాస్త్రవేత్తలు అన్నారు కానీ ఇందుకు గల కారణాలు నిగూఢంగానే ఉన్నాయి. గతవారం హార్వర్డ్ విజ్ఞానవేత్తలు ఆఖరికి ఒక వివరణ ఇచ్చారు.

సాధారణంగా హానికరం కానటువంటి స్టెఫిలో కాకస్ ఆరియస్ అనే ఒక బాక్టీరియా ఉత్పత్తి చేసే విషప్రభావం వల్ల ఈ టాక్సిక్ షాక్ సింద్రోమ్ (టి. ఎస్. ఎస్.) జబ్బు వస్తుందని అనేక సంవత్సరాల నుంచి పరిశోధకులకు తెలుసు. పాలిస్టర్ ఫోమ్, పాలీ అక్రిలేట్ రేయాన్ దారాలతో తయారయిన టేంపన్లు వాడే సమయంలో ఈ బాక్టీరియా ఇరవై రెట్లు అధికంగా విష ప్రభావం గల పదార్థాన్ని ఉత్పత్తి చేస్తాయని అంటురోగ చికిత్సా నిపుణుడైన ఎడ్వార్డ్ కాస్ ఆధ్వర్యంలో పరిశోధనాశాలలో పరిశోధిస్తున్న హార్వర్డ్ బృందం కనుగొన్నారు. ఎందుకంటే స్త్రీ యోని స్నాయువులలో, ద్రవాలలో ఉండే మెగ్నిషియమ్‌ని ఈ పాలిస్టర్ రేయాన్ దారాలు ఎక్కువగా పీల్చి వేస్తాయి. ఎప్పుడైతే మెగ్నిషియం వేరు చేయబడిందో అప్పుడే ఈ సూక్ష్మజీవులు ఎక్కువ మోతాదులో విష సంబంధమైన పదార్థాన్ని వెలువరిస్తాయి. కాస్ అంతకు ముందు డిఫ్తీరియా పై చేసిన పరిశోధనలో కూడా మెగ్నిషియంకు సంబంధించిన ఒక ముఖ్యమైన ఆధారం దొరికింది. అది కూడా బాక్టీరియా వెలువరించే విషపదార్థానికి సంబంధించినదే. ఇనుము ధాతు హీనత ఏర్పడినప్పుడు డిఫ్తీరియా వ్యాధిని కలుగజేసే క్రిములు విషపదార్థాన్ని అధిక పాళ్లలో ఉత్పత్తి చేస్తాయని ఆయన అన్నారు. మీ మెదడుకి కొంచం పదును పెడితే అసలు విషయం బోధపడుతుందన్నారాయన. కాస్, అతని బృందం స్టాఫ్ ఆరియస్‌తో సమానంగా మెగ్నిషియం పాత్ర వహిస్తుందని కనుగొన్నారు.

మహిళలలో ఋతుస్రావం అయిన నాలుగవ రోజే అనగా ఋతుస్రావం నిలిచిపోయిన తరువాత ఈ టి. ఎస్. ఎస్. వ్యాధి ఎందుకు సోకుతోంది అన్నదానికి ఈ మెగ్నిషియం సంబంధం చక్కగా విశదీకరించడానికి ఉపయోగపడుతుంది. ఋతుస్రావం అయిన మొదటి రోజులలో అధిక స్రావం ఉండటం వల్ల కొంత టేంపన్లు పీల్చుకున్నప్పటికీ కొంత మెగ్నిషియం టేంపన్లచే పీల్చుకొనకుండా ఉన్నందు వల్ల విష ప్రభావం గల పదార్థ ఉత్పత్తి అదుపులో ఉంటుందని ఎడ్వర్డ్ కాస్ అభిప్రాయ పడ్డారు.

ఈ టి. ఎస్. ఎస్. అమితంగా భయాందోళనలు కలుగజేసినప్పటికీ దీనివల్ల దెబ్బతిన్న వాళ్ళు కొద్ది మంది మాత్రమే. అమెరికాలో ఇరవై ఏళ్ళు వచ్చేటప్పటికి 95 శాతం మంది స్టెఫి ఆరియస్ విష ప్రభావానికి గురికాబడి తట్టుకోగల శక్తిని సంపాదించుకుంటారని, మిగిలిన 5 శాతం జన్యుశాస్త్ర రీత్యా తట్టుకోగల శక్తిని వృద్ధి చేసుకోవడంలో విఫలులవుతారని డాక్టర్లు అంచనా వేశారు. ఈ 5 శాతం స్త్రీ, పురుషులు, టి. ఎస్. ఎస్. వచ్చిన వారి కన్నా ఎక్కువ బాధ పడతారు. దీనిని యాంటి బయాటిక్స్‌తో నివారణ చేయవచ్చు.

పాలిక్రియలేట్ రేయాన్ దారాలతో తయారు చేసే టేంపన్ల స్థానంలో తక్కువగా పీల్చుకునే పద్ధతిలో హానికరం కానటువంటి టేంపన్ల ఉత్పత్తి చేయాలని హార్వర్డ్ పరిశోధనలు ఇప్పటికే ప్లేటెక్స్ టేంపెక్స్ టేంపన్ల తయారీదారులకు సూచించాయి.

పాలిస్టర్‌తో టేంపన్లు తయారు చేసే ఒకే ఒక సంస్థ ప్రోక్టర్ అండ్ గాంబెల్స్ 1980 లో నిలిపివేయబడిన తరువాత టి. ఎస్. ఎస్. జబ్బు రేటు పడిపోయింది. టేంపెక్స్ తయారీ దారుడైన టాంబ్రాండ్స్ ఆధ్వర్యంలో జరుపుతున్న తన పరిశోధన సురక్షితమైన టేంపన్ల ఉత్పత్తికి తయారీదారులకు సహాయపడుతుందని 'కాస్' ఆశాభావంతో ఉన్నారు.

(టైమ్ ఆధారంగా)

## వదినా! వదినా! వైఢూర్యమా!!

అన్నారు వణుకుతున్న కంఠంతో పార్వతమ్మ.

"వదినా, నువ్వేం చేసుకొస్తావో?.... ఈ ఉత్తరమే వాళ్ళ నిర్ణయమైతే నేను బ్రతకడం అనవసరం!" అంది మనసులో నే కుమిలిపోతూ రాజ్యలక్ష్మి.

ఇంటిల్లిపాది భారమంతా శిరీషమీదనే వేశారు. బుచ్చిబాబు భోజనం చేసి, చెల్లెలి పెళ్ళి విషయమై శిరీషనో మారు హెచ్చరించి, కేంపు కెళ్ళడం తప్పని సరవడంవల్ల బాధ పడుతూ వెళ్ళిపోయాడు.

మరో అరగంట తర్వాత రామంతో బాటు రంగపట్నం వెళ్ళడానికి బస్‌స్టాండ్ కొచ్చింది శిరీష - బస్సు ఇంకా ప్లాట్‌ఫామ్ మీదకి రాలేదు.

"వదినా! మనం రంగపట్నం వెళ్ళొచ్చాక ఏం చెబుదామని నీ ఉద్దేశ్యం?" శిరీష నడిగాడు రామం.

"నువ్వేం చెప్పాలనుకుంటున్నావు?" తిరిగి అడిగింది శిరీష.

"ఏమో వదినా! నాకేం తెలియడం లేదు...."

"అందంగా వుంది. ఆ శంఖవరం రామనాథంగా రమ్మాయే నా క్కావాలి వదినా అని నన్ను చంపడం తెలుసు కాబోలు...." అని చిన్నగా నవ్వి- "అసలు వాళ్ళా ఉత్తరమే వ్రాయలేదట. కిట్టని వాళ్ళెవరైనా అలా కల్పించి వ్రాశారేమోనని సర్వారాయుడుగా రన్నారని చెబుదాం!" అంది శిరీష.

"నువ్వు వాళ్ళకు ఇలా ఉత్తరం వ్రాయమని వ్రాశావు - బాగానే వుంది. ఈ ఉత్తరంచూసి మనం కాకుండా అన్నయ్యో - నాన్నో వెళ్ళారనుకో అక్కడికి. అప్పుడేమంటావ్ వదినా?"

"ఏమవుతుంది - ఏమీ కాదు. ఎవరొచ్చి అడిగినా ఆ ఉత్తరం తాము వ్రాయలేదని, తమ కెలాంటి దురుద్దేశ్యంలేదని చెప్పమని నేను వాళ్ళకు ముందే వ్రాశానుగా!" అంది నవ్వుతూ శిరీష.

"మంచి పథకం వేసి, అమ్మను మార్చి, నేను కోరుకున్న అమ్మాయిని పొందగలిగేలా చేసిన వదినా! నా వదినా! నిజంగా నువ్వు వైఢూర్యానివి!!" అన్నాడు ఆనందాతిరేకంతో రామం.

"వైఢూర్యాన్నో - వజ్రాన్నో గాని రామం - నువ్వు కోరుకున్న అమ్మాయి కోసం.... అత్తయ్యలో మార్పుకోసం; సర్వారాయుడుగారి చేతిలా ఉత్తరం వ్రాయించి అందరికీ మనస్తాపం కలిగించినందుకు నాకెంతో బాధగా వుంది..." అని శిరీష అంటూండగానే ప్లాట్‌ఫామ్ మీదికి బసొచ్చింది.

(ఈ కథ పేరుతో ఓ కథ వ్రాయమన్న చిన్నికి, ప్రియమిత్రులు శ్రీకంఠస్ఫూర్తికి కృతజ్ఞతలు) □